ఇంక జాగుచేస్తే లాభంలేదు, మువ్వ. లేచి వెళ్లేను కౌంటర్ దగ్గరకి.

"ఇదిగో, ముందే యిచ్చేస్తున్నాను నాలుగుకప్పుల కాఫీకి డబ్బు. ఏం భయం లేదు. మెంటల్ హాస్పిటల్ కి ఫోన్ చెయ్యండి కావలిస్తే. ఎవరూ అక్కణ్ణుంచి తప్పిపోయి రాలేదు. అంతా భద్రంగానుంది అక్కడ. ఉన్నిథన్ నా లాంగ్ లాస్ట్ ఫ్రెండ్. మీ కళ్ళల్లో పెంచుతున్నవి అల్పేషన్లా, దేశ్మేషన్లా, దేకొషుండ్లా!"

తిరిగి వచ్చేశాను టేబుల్ దగ్గరకి - జవాబెందుకు నాకూ?

నిటారుగా, నీటుగా నిలబడ్డ కొబ్బరిచెట్ల దారులో, తిక్కగా, సినికల్ గా, పంక్చుయేషన్ మార్కులన్నీ ఒకేచోట జలిమిలి అయిపోయినట్లు, ఎనిమిది వంకర్లతో పెరిగే యింట్రోవర్ట్ కొబ్బరిచెట్టులానిలబడున్నాడు ఉన్నిథన్ గోడ నానుకుని.

"సెమికోలన్, ఎక్స్ క్లమేషన్ మార్కులూ విడదీసి, ఇక్కడకు వస్తావా ఉన్నీ." వచ్చాడు. "మూడోకప్ తీసుకురా, ప్లీజ్."

ఒక్కొక్కమార్కూ అలా నేలమీద జల్లుతూ వెళ్ళేడు లోపలికి హెమింగ్వే వాక్యంలాగ - నీట్ గా, బ్రిస్కుగా, ఓవర్ టోన్స్ ఏవీ లేకుండా.

భగవంతం వస్తుంటే ఏక్సిడెంటేదేనా అయి ఎముకలేవేనా విరిగి....?

పసితనపు నూనూగుకీ, పెద్దతనపు గడుసుతనం, చలాకీకి మధ్య తటపటాయిస్తున్న నలుగురిస్టూడెంట్ల గేంగ్ వచ్చింది లోపలికి తుళ్ళుకుంటూ.

టేబుల్ చుట్టూ చదరంగా వుంచినకుర్చీ లనిరకరకాల కోణాల్లోకి తిప్పి, జారబడుతూ కాళ్ళు మెలికలుగా తిప్పుతూ, జావుతూ కూర్చున్నారు.

ఉన్నిథన్ మూడో కాఫీ తెచ్చాడు. కాఫీ; అది కాఫీకాదు. ఉత్త వేడిరంగు గోధుమ ఊహ.

....బెంజి గాడేవిటి చెప్పేడురా ఇవాళ?

....సరస్వతిలో టోపీ కర్టిస్, ఎలిజబెత్ టేలర్....

సుజాత అలాగ పతివ్రతలాగ క్లాసులో కూర్చుంటుందిగాని దానికి ఇద్దరు లవర్సురా బాబూ....

....ఉత్త దుస్కి మాటలాడకోయ్....

భగవంతం రాడు గాబోలు. పది లెక్క పెట్టి లేచాను. పైకివెళ్తూ, యీపై మాటల దగ్గర ఆగి అన్నాను విషాద స్వరంలో: అన్నీ కలిపేయండి. ఒకదానికొకటి గొలుసు లాగ కలిపి ఆలోచించండి. అర్థమయిపోతుంది. ఆ తరువాత అంతా సులభమే.

కౌంటర్ దగ్గరచేరి, "మూడే తాగేను. నాలుక్కిచ్చేను. అదే లోకన్యాయం. మిగతాది పర్గటోరియోలో మనమిద్దరం కలుసుకున్నపుడు యిద్దురుగాని. టైంలేదు. ఉన్నిథన్ కి కూడా చెప్పండి. బై. బై." అని పైకి వచ్చేశాను.

ఆకాశంలో నక్షత్రపుజల్లు. భగవంతం రాడు. అట్నుంచి ఏడోనంబర్లోనూ రాడు. ఇట్నుంచి పదమూడో నంబర్లోనూ రాడు. నా పిచ్చిగాని. □□□





# శ్రీశ్రీ పంచపదులు

## ప్రపంచ తంత్రం



వహావ్వాళ్లో కొంత మంది కాకా
రాయుళ్లన్నారు వాళ్ళు బాకా
బాగా పడతారు కాని అదంతా కా
వలిసింది సాధించుకొనేదాకా
ఆమీద ఇస్తారు ధోకా

## గురులఘువులు



మహా మహా
కవులు సహా
రా యెడారి దారుల్లో విహా
రాలు చేస్తున్నా రహా
తమ శిష్యుల్తో సహా

## ఉభయశ్రీ



"రెండు శ్రీలు ధరించి
రెండు పెగ్సు బిగించి
వరలు శబ్ద విరించి"
అనుచు మీకెను దించి
ఆరుద్ర కవితా విపంచి

# శ్రీశ్రీ పంచపదులు

## మెదళ్లకి కళ్లు

ఆలోచించడం
అంటే ఊకని దంచడం
కాదు ఊహని పెంచడం
వ్యథల్ని చించడం
సుధల్ని పంచడం



## ప్రాసోపదేశం



అసమర్థుడి చేతిలో ఆసానెన్ను
అందించదు సరిగ్గా రిసానెన్ను
దానికి కావాలెంతో విజిలెన్సు
అందుకే ఛందోరహస్యం తెలిసిన వెటరన్సు
స్ట్రెయిట్ రైమ్‌కే ఇస్తారు ప్రిఫరెన్సు

## అల్లసానిజం

ఆరోజుల్లో కవిత్వం
నిరుపహతి స్థలం
కప్పుర విడెం భోజనం
ఊయెలమంచం రసజ్ఞ పాఠకలోకం
దొరికితేనే శక్యం



జ్యోతి



# శ్రీశ్రీ పంచపదులు



## R. I. P. for a V. I. P.

అమెరికా ప్రెసిడెంటుకి కూడ
రక్షణ లేదోరి బుల్లోడ
నీయిల్లు ఒక చిల్లి ఓడ
నీ స్వేచ్ఛ సుడిగాలి మేడ
వదిలించుకో ఇంక ద్వేషాల పీడ

## నో పార్కింగ్

జో
రుగా పో
వగానే సరికాదురో
సిసలైన అసలైన గమ్యంతో
సూటైన బాటనే గో





## Tale with a tail

అనగా అనగా ఒక దొరగారు
ఊళ్ళన్నీ కాళ్ళరిగేట్టు తిరిగారు
ఎండల్లో ఎండి వానల్లో తడిశారు
ప్రస్తుతం వారు కాసుకైనా కొరగారు
అంచేత కొంచెం లెఫ్టుకి జరిగారు

## గద్యపద్యచింతామణీ



పద్యం
ఎక్కువా లేక గద్యం
ఎక్కువా అనే సమస్య అభేద్యం
బినా ఘంటా వాద్యం
గా నేనంటానీరెండూ నాకే నైవేద్యం



## ఏ యెండ కా కొడుకు

తుక్కుగొడుగు పార్టీల అభిప్రాయాలు
కూడా కావాలి చర్చనీయాలు
అందుకే ఈనాడు రాజకీయాలు
అందరికీ ఉపాదేయాలు
అప్పుడే తేలుతాయి న్యాయాన్యాయాలు



## కవిత్తం

ఏనాటికైనా డబ్బు
అదోరకం అబ్బు
రంపు వెధవ జబ్బు
ఉండదా దాన్ని కుదిర్చే మెడిసినల్ సబ్బు
చెండదా దాన్ని కవిగారి కలం నిబ్బు



## Slow గన్లు

వింటే తెలుగు భారతమే వినాలి
తింటే పెరుగు గారెలే తినాలి
అంటే అంతా మెచ్చేదే అనాలి
కంటే టెక్నికలలే కనాలి
కొంటే జ్యోతి పత్రికనే కొనాలి



# అగ్నిపుష్పం

కళ్యాణ సుందరీ జగన్నాథ్

ఉదయాన్నే సన్నాహాలన్నీ ఆరంభమైనాయి. ఆహ్వానించిన వాళ్ళంతా నెమ్మదిగావచ్చి చేరుతున్నారు.